ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08.12.2024 సమయం13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో తమ ఏడాది పాలన పూర్తి సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

2. 150 రకాల పౌర సేవలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రభుత్వం ఈరోజు కొత్త మీ సేవా యాప్ ను ప్రారంభిస్తోంది.

3. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై బిఆర్ఎస్ పార్టీ ఈరోజు చార్జ్ షీట్ ను విడుదల చేసింది.

4. గ్రూప్ – 2 పరీక్షలకు అభ్యర్థులు రేపటి నుంచి వెబ్ సైట్ లో హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది.

**సిఎం ట్వీట్**

ఏడాది పాలన తమకు పూర్తి సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. రుణమాఫీ, పంట బోనస్ , ఉద్యోగాల కల్పన , పెట్టుబడుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 21 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫి , వడ్లకు 500 రూపాయల బోనస్ , 55 వేల ఉద్యోగాలు అందించామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచిన ప్రజలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

ఎక్స్

**ప్రజా పాలన- మీ సేవ**

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఐటీ శాఖ ఈ రోజు హైదరాబాద్ లో పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభిస్తోంది. మీ సేవ ద్వారా 150 రకాల పౌర సేవలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రత్యేక మొబైల్ యాప్ ను ఆవిష్కరిస్తారు. మీసేవ యాప్ ద్వారా ప్రజలు ఇంటి నుంచే పౌరసేవలు పొందవచ్చు. మెట్రో స్టేషన్లు , షాపింగ్మాల్స్, సమీకృత కలెక్టరేట్లు ఇతర రద్దీ ప్రాంతాల్లో ఇంటరాక్టివ్ కియోస్క్ ద్వారా ప్రజలు ఈ పౌర సేవలు పొందవచ్చు. దరఖాస్తులు , డిజిటల్ చెల్లింపులు, సర్టిఫికెట్ ప్రింట్ తీసుకునే అవకాశాలు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ అందించేందుకు ఉద్దేశించిన టీ-ఫైబర్ ప్రాజెక్టును కూడా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు ప్రారంభిస్తారు. ఫైబర్ పైలట్ ప్రాజెక్టు కింద మూడు జిల్లాల్లోని ఒక్కో గ్రామంలో 4 వేల కుటుంబాలకు కేబుల్ టీవీ సేవలతో కూడిన బ్రాడ్బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు అందిస్తారు. పెద్దపల్లిలోని అడవి శ్రీరాంపూర్ , సంగారెడ్డిలో సంగుపేట , నారాయణపేటలోని మద్దూర్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ, అల్పాదాయ వర్గాల మహిళలకు డిజిటల్ అవగాహన పెంచేందుకు ప్రాజెక్టు సన్మతి ని కూడా ఐ టి శాఖ ప్రారంభిస్తుంది. తొలుత మహబూబాబాద్ , ములుగు జిల్లాల్లో దీనిని పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలు ఉన్నాయి.

(DESK)

**ఎయిర్ షో**

ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు హైదరాబాద్ లో ట్యాంకుబండ్ పై ఎయిర్ షో నిర్వహిస్తారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఎయిర్ షో కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారు. ఎయిర్ షో కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి షో ముగిసే వరకు ట్యాంక్ బండ్ పై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

(DESK)

**హరీష్ రావు**

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ఎడాది పాలన – ఎడతెగని వంచన పేరుతో బిఆర్ఎస్ చార్జ్ షీట్ ను పార్టీ సీనియర్ నాయకుడు హరీష్ రావు హైదరాబాద్ లో విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అపరిపక్వ వైఖరితో తెలంగాణ ప్రగతి మసకబారిందని ఆయన విమర్శించారు. అశాంతి, అలజడులతో రాష్ట్రం అతలాకుతలం అవుతోందని, 9 చోట్ల మత కలహాలు జరిగాయని ఆయన అన్నారు. హైడ్రా పేరిట కూల్చివేతలు చేపట్టి అరాచకాలు సృష్టించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికి 50 శాతం మంది రైతులకు రుణమాఫి కాలేదని , నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు వంటి హామీలను నెరవేర్చలేదని హరీష్ రావు విమర్శించారు. పెన్షన్ల పెంపు , మహిళలకు 2 వేల రూపాయల వంటి హామీలు కూడా అమలు చేయలేదని అన్నారు.

డెస్క్

**జగదీష్ రెడ్డి**

హైదారాబాద్ సచివాలయంలో తెలంగాణ తల్లి పేరుతో ఏర్పాటు చేయబోయే విగ్రహాన్ని తాము అంగీకరించబోమని మాజీ మంత్రి , సూర్యాపేట ఎంఎల్ఏ జగదీష్ రెడ్డి అన్నారు. అక్కడ ఏర్పాటు చేయబోయేది తెలంగాణ తల్లి కాదని , కాంగ్రెస్ మాత ఆకారంతో ఉన్న విగ్రహాన్ని తాము విభేదిస్తున్నామని ఆయన నల్లగొండలో విలేకరుల సమావేశంలో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండలో కేసీఆర్ పూర్తి చేసిన పనులకు ప్రారంభోత్సవాలు చేశారు తప్ప కొత్తపేమి లేదని ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ పాజెక్టు కేసీఆర్ ముందు చూపుకు నిదర్శనమని అన్నారు.

(PTC-NLG)

**దివ్యాంగులు- ఉపాధి హామీ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని దివ్యాంగులు ఉపయోగించుకునేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది దివ్యాంగులకు సుమారు 35 వేల పని దినాలు కల్పించి వారి

పనికి తగిన వేతనం అందేలా కృషి చేస్తున్నట్టు మణుగూరు మండలం ఉపాధి హామీ పథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్ బెజ్జం రామారావు ఆకాశవాణి ప్రతినిధి హరికృష్ణకి తెలియచేశారు.

BYTE

(PTC-BCM)

**గ్రూప్-2**

ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. అభ్యర్థులు రేపటి నుంచి టీజీపీఎస్సీ వెబ్సైట్లో హాల్టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇది రెండో గ్రూప్- 2 నోటిఫికేషన్. ఈ పరీక్షలో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరుకు 150 మార్కులు కేటాయిస్తారు. ఇందులో మెరిట్ మార్కులు సాధించిన అభ్యర్థులను గ్రూప్- 2 అధికారులుగా ఎంపిక చేసిన అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారు.

(DESK)

**రోడ్డు ప్రమాదం**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో జాలిగామ బైపాస్ రోడ్డు వద్ద ఈ ఉదయం ఒక బైక్ ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదం లో బైక్ పై ఉన్న ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పరంధాములు రాయిపో ల్ పోలీస్ స్టేషన్ లో , వెంకటేశ్ దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబు ళ్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ హైదరాబాద్ ఈసీఎల్ లో జరుగుతున్న మారథాన్ లో పాల్గొనడానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

(PTC-SDP)

**వర్షాలు**

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ తో సహా పలు జిల్లాల్లో నిన్న అర్ధరాత్రి నుంచి వర్షం కురిసింది. ఇవాళ , రేపు కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.
డెస్క్

**సింగరేణి**

సింగరేణిలో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో నుంచి 33 శాతం వాటాను సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల 12న చెల్లించేందుకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేత సీతారామయ్య తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టంబర్ వరకు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు లాభాల వాటా చెల్లిస్తారు.
(PTC-MCRL)

**చాడ వెంకటరెడ్డి**

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతోందని , సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ , బ్యాంకుల్లో అప్పులు తీసుకొని విదేశాల్లో దాక్కున్న నీరవ్ మోదీని అప్పగించా లంటూ బ్రిటన్ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో ప్రజలకు వివరించాలని ప్రధాన మంత్రిని డిమాండ్ చేశారు.
(PTC-RS)

**పశు శిబిరం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పశు సంవర్ధక శాఖ సహకారంతో జాతీయ సేవా పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. భద్రాచలంలోని పశువైద్య శాలలోను, సీతారామ చంద్రస్వామి గోశాల లోను నిర్వహించిన శిబిరాలలో పశు వైద్యాధికారులు, పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొని పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**యాదాద్రి - పీఎం అజయ్**

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో   15 మందికి పీఎం అజయ్ పథక  ంలో భాగంగా ఒక్కో రైతుకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా లక్ష రూపాయల రాయితీ రుణం మంజూరు చేసినట్లు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్రావు తెలిపారు. ఈ  నిధుల మంజూరుతో రైతులు తమ భూముల్లో బోరు , మోటారు, విద్యుత్తు కనెక్షన్ బిగించుకునే అవకాశం కలిగిందని వెల్లడించారు.

(PTC-YDB)

**అంబులెన్సులు**

నిజామాబాద్ జిల్లాకు కొత్తగా ఏడు  108 అంబులెన్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ తెలిపారు...ధర్పల్లి , ఇందల్ వాయి , జక్రాన్పల్లి, రుద్రూర్, ఎడపల్లి, పొతంగల్, సాలూర మండలాలకు వీటిని కేటాయించినట్లు తెలిపారు.

(PTC-MCRL)